క్లుప్తంగా

నూతన నియామకం


మడితాటి సురేంద్రారెడ్డి

సుండుపల్లి : వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర ఉద్యోగ, పెన్షనర్ల విభాగం సెక్రటరీగా ముడుంపాడు గ్రామ పంచాయతీకి చెందిన మడితాటి సురేంద్రారెడ్డిని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, తనకు పదవి ఇచ్చిన వైఎస్‌ఆర్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగనమోహన్‌రెడ్డికి, సహకరించిన పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటికి కృతజ్ఞతలు తెలిపారు.

మొక్కు తీర్చుకున్న అభిమాని


అభిమానితో కలసి గంగమ్మను దర్శించుకుంటున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి గత ఏడాదిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందినందుకు వైఎస్సార్ సీపీ నాయకుడు, ఆకేపాటి అభిమాని బిల్లా నరేష్‌కుమార్ ఆదివారం బలిజపల్లె గంగమ్మకు 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, గిరి, సుబ్బరాజు, హరి, దండు గోపి, సోంబత్తిన శ్రీనివాసులు, గుగ్గిళ్ల రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి కుర్చీలు వితరణ


కుర్చీలను వితరణ చేస్తున్న మంత్రి మండిపల్లి

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా రాష్ట్ర యువజన, క్రీడలు, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో 30 కుర్చీలు వితరణ చేశారు. ఆదివారం ఆయన ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. గతంలో ఆస్పత్రిలో రోగులకు కూర్చోవడానికి ఇబ్బంది పడుతున్న దృశ్యాలను చూసిన ఆయన ఆస్పత్రికి కుర్చీలు సమకూర్చారు. ఈ సందర్భంగా వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలు పరిష్కరిస్తానని తెలియజేశారు.

గాలివీడు వాసికి ఎక్సలెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న రామకృష్ణారెడ్డి

గాలివీడు : మండల వాసి ఆర్కే అబాకస్ వ్యవస్థాపకుడు తాతిరెడ్డి రామకృష్ణారెడ్డికి అకాడమిక్ ఎక్సలెన్స్ అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్‌లోని ట్రిపుల్‌-ఎ అబాకస్ వారి ఆధ్వర్యంలో అంగుళియా అర్థమేటిక్స్ పైన శిక్షణ అనంతరం 20వ ఇంటర్నేషనల్ అబాకస్ కాంపిటీషన్స్ నిర్వహణకు ట్రిపుల్‌-ఎ వారి ఆధ్వర్యంలో ఈ అవార్డులను ప్రదానం చేయడం జరిగిందని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. అనంతరం అకాడమిక్ ఎక్సలెంట్ అవార్డును అందుకోవటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అనగాని రెడ్డెప్ప, అశోక్ రెడ్డి, కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు అందుకున్న గంగమ్మ

సిద్దవటం : మండలంలోని జ్యోతి గ్రామ శివారులో వెలసిన శ్రీ గంగమ్మ అమ్మవారికి ఆదివారం స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్ర నామావళి, కుంకుమార్చన అర్చనలు, తీర్థ ప్రసాదాల సమర్పణ వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారికి దర్శించుకొని కాయా కర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. జ్యోతి గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి కుటుంబీకులు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెద్దతిప్పసముద్రం : కందుకూరు సమీపంలోని పర్తిగడ్డ వద్ద పట్టెంవాండ్లపల్లికి చెందిన నారాయణమూర్తి (45) ఆదివారం ద్విచక్ర వాహనంలో వెళుతూ ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మదనపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

మధుర ఫలం.. విషతుల్యం

- పండ్లను మాగబెట్టేందుకు రసాయనాల వినియోగం
- ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న కెమికల్స్
- రైపనింగ్ చాంబర్ల ఏర్పాటు పట్ల ఆసక్తి చూపని రైతులు


విక్రయానికి సిద్ధంగా ఉన్న మామిడిపండ్లు

రాయచోటి జగదాంబ సెంటర్ : ఆహారంలో పండ్లకు అధిక ప్రాధాన్యం కలదు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగిన నేపథ్యంలో రోజువారీ ఆహారంలో జామ, బొప్పాయి, దానిమ్మ, కమలా తదితర పండ్లను తీసుకుంటున్నారు. వైద్యులు, న్యూట్రిషియన్లు సైతం పండ్లు, గింజల నానబెట్టిన సీడ్స్‌ను తినండంటూ అవగాహన సైతం కల్పిస్తున్నారు. శాఖాహారం తీసుకునేవారు రోజు మొత్తంలో పండ్లను ఎక్కువగా భుజిస్తారు. తినే పండ్లలో ఆరోగ్యశాతమెంతన్న ప్రశ్న వినియోగదారులను వేధిస్తుంది. అరటి, మామిడి పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్లో పండ్లను మాగబెట్టేందుకు కాల్షియం కార్బైడ్ తదితర రసాయనాలను వినియోగిస్తుండటంతో ఫలాలు విషతుల్యమవుతున్నాయి. పోషకాలతో పాటు విషపదార్థాలు శరీరంలోకి వెళ్లడం ద్వారా ఆరోగ్యం దెబ్బతింటోంది. ఈ విషయమై జిల్లా స్థాయిలో ఇటీవలే అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పండ్ల వ్యాపారస్తులతో సమావేశమై పలు సూచనలు, సలహాలను చేశారు.


అసహజ పద్ధతిలో మాగబెట్టిన అరటిపండ్లు


పండ్ల వ్యాపారస్తులతో సమావేశమైన జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్(ఫైల్)

రసాయనాల వినియోగం ఇలా..

ఉత్పత్తి అయిన వ్యవసాయ క్షేత్రం నుంచి వినియోగదారుడికి పండ్లు చేరే మధ్యలో మార్కెట్ కీలకమైనది. పండు చెట్టు మీదనే పరిపక్వతకు వచ్చాక తినడమనేది దాదాపు సాధ్యం కాదు. పచ్చిగా ఉండగానే వాటిని ప్రకృతి సిద్ధంగా మాగబెట్టి మార్కెట్‌లో విక్రయించాల్సి ఉంది. అయితే సమయానుకూలత వల్ల దళారులు రసాయనాల వినియోగం ద్వారా పండ్లను మాగబెడుతున్నారు. మామిడి పండ్లకు కాల్షియం కార్బైడ్, అరటికి ఇథెఫాన్ లిక్విడ్‌లను స్ప్రే చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా మార్కెట్‌కు, రైతుకు మధ్య ఉన్న దళారీలే చేస్తున్నారు.

సహజసిద్ధంగా పండిన పండును గుర్తించండి ఇలా..

సహజ సిద్ధంగా మాగిన మామిడిపండ్లు కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలి భాగం అంతా పరిపక్వత చెంది ఉంటుంది. కమ్మని వాసనను మనం దూరంగా ఉన్నప్పటికీ గ్రహించగలుగుతాం. సహజసిద్ధమైన తీపి ఎక్కువగా ఉంటుంది. రసాయనాలతో మాగించిన పండు మొత్తం ఒకే విధమైన కాంతివంతమైన లేత పసుపు కలిగి ఉంటుంది. పైకి మాగినట్లు కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి పుల్లగా ఉంటుంది. కమ్మని వాసన ముక్కు దగ్గర ఉంచినప్పుడు మాత్రమే వస్తుంది. తక్కువ తీపి ఉంటుంది.

విజిలెన్స్ దాడులు

పండ్లను రసాయనాలతో మాగబెట్టి అమ్మడంపై విజిలెన్స్ శాఖ దాడులు నిర్వహించి కేసులను నమోదు చేస్తుంది. రసాయనాలు వినియోగించారా లేదా అనేది ఉద్యానశాఖాధికారులు నిర్ధారించగా సంబంధిత అధికారులు చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటారు. పండ్లు విషతుల్యం కాకుండా ఉండేందుకు ప్రకృతి సిద్ధమైన రైపనింగ్ చాంబర్లలో పండ్లను మాగబెట్టి విక్రయించడం మేలు.

ఆరోగ్య సమస్యలు వస్తాయి



కాల్షియం కార్బైడ్‌ను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. దాంతో మగ్గబెట్టిన పండ్లు తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలొస్తాయి. రోజూ పండ్లు తినేవారు సహజసిద్ధంగా పండించిన పండ్లు తినడం మేలు. ప్రత్యామ్నాయంగా ఎథిలిన్ హార్మోన్ స్ప్రే చేయొచ్చు. రైపనింగ్ సెంటర్లు ప్రయోజనకరంగా ఉంటాయి.

– వనిత బాయి, ఉద్యానవన శాఖాధికారి, రాయచోటి

వాహనాల రికార్డులు తప్పనిసరి


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ సుధాకర్

చిన్నమండెం : వాహనదారులు తమ రికార్డులను తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలని ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. మండల పరిధిలోని దేవళంపేట క్రాస్ వద్ద ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారుల రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్లను ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ అంజిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

11న మోడల్ ఈఏపీసెట్

కురబలకోట : అంగళ్లలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 11న మోడల్ ఈఏపీసెట్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. ఆదివారం కరస్పాండెంట్ డాక్టర్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. అవకాశాన్ని ఇంటర్ పాసైన విద్యార్థులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. వివరాలకు 8712655132, 134,138 ఫోన్ నెంబర్ల ద్వారా సంప్రదించాల్సిందిగా కోరారు

రాజధాని నిర్మాణం పేరుతో ప్రజాధనం దోపిడీ

- సంక్షేమ పథకాల అమలును గాలికొదిలేశారు
- కూటమి పాలనపై మండిపడ్డ వైఎస్సార్‌సీపీ నేత శిబ్యాల


మాట్లాడుతున్న శిబ్యాల విజయభాస్కర్

రాయచోటి అర్బన్ : రాజధాని అమరావతి నిర్మాణం పేరుతో మరోమారు లక్షల కోట్లు దండుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడు రంగం సిద్ధం చేసుకున్నారని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం నిల్.. అప్పులు మాత్రం ఫుల్ అన్నట్లుగా పరిస్థితి ఉందన్నారు. రాజధాని నిర్మాణం పేరుతో లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తూ నిధులను సింగపూర్‌లోని తన వ్యాపార సామ్రాజ్యానికి తరలించుకుంటూ మరింత ధనవంతుడిగా మారుతున్నారంటూ తెలియజేశారు. అమరావతిని సింగపూర్‌ను మించిన నగరంగా నిర్మిస్తామంటూ కథలు చెబుతూ లక్షల కోట్లు అప్పులు చేస్తూ సర్వనాశనం చేస్తున్నారంటూ ఆరోపించారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకుని అధికారం దక్కించుకున్న చంద్రబాబు ప్రజల సంక్షేమాన్ని గాలికి వదలేశారంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చాక చంద్రబాబు కొత్తగా సంక్షేమ పథకాలను అమలు చేయకపోగా జగనన్న ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టి అమలుచేసిన సంక్షేమ పథకాలన్నింటిని రద్దుచేసి పేద ప్రజల కడుపుకొట్టాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తన పాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రధాని నరేంద్ర మోడీని చూపుతూ ప్రజలను ఏమారుస్తున్నాడంటూ విమర్శించారు. ప్రజలు బాబు మోసాలను గ్రహిస్తూ చైతన్యవంతులు అవుతున్నారన్నారు. త్వరలోనే బాబుకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు ఉన్నాయన్నారు. సమావేశంలో వైఎస్‌ఆర్‌సీపీ బీసీ నేతలు శివశంకర్ యాదవ్, బుజ్జిబాబులు పాల్గొన్నారు.

నాబార్డు నిధులతో రహదారుల నిర్మాణం

రాయచోటి టౌన్ : రాయచోటి నియోజకవర్గంలోని పలు గ్రామాలు, మండల కేంద్రాలను కలిపే రహదారులను కలిపేందుకు రూ.12.06 కోట్లతో పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ చిన్నమండెం, గాలివీడు, రాయచోటి రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాలను కలిపే రోడ్లతో పాటు పాడైపోయిన దారులకు మరమ్మతులు చేసేందుకు నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామీణ దారులకు మహర్దశ వచ్చినట్లుగా చెప్పారు.

భక్తులతో కిటకిటలాడిన కొత్తపురమ్మ ఆలయం


కొత్తపురమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల గ్రామ శివారుల్లో వెలసిన శ్రీ కొత్తపురమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం అమ్మవారి మూల విరాట్ మూర్తికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. మొక్కులు తీరిన భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

పూజలందుకున్న పాలేటమ్మ


ప్రత్యేక అలంకరణలో పాలేటమ్మ

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామంలో వెలసియున్న పాలేటమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారి మూలవిరాట్‌ను సుందరంగా అలంకరించారు. అనంతరం మొక్కుబడులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

గృహప్రవేశ వేడుకలో మాజీ ఎమ్మెల్యే


పూజల్లో పాల్గొన్న గడికోట మోహన్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని పందిళ్లపల్లి గ్రామం కొక్కంటివారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కొక్కంటి మల్‌రెడ్డికి చెందిన గృహ ప్రవేశ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేంద్ర బాబు, ఎంపీటీసీ జగన్మోహన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఢిల్లీ విశ్వనాథరెడ్డి, లక్ష్మిరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కుర్నూతల గ్రామం తీయలవాండ్లపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండారెడ్డిని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి పరామర్శించి, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బయ్య, జగన్మోహన్ రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

విస్తరణ జరగదు.. సమస్య తీరదు


భాకరాపేట మూడు రోడ్ల కూడలి వద్ద నిలిచిన భారీ వాహనాలు

సిద్దవటం : మండలంలోని కడప – చెన్నై జాతీయ ప్రధాన రహదారిలో తరచూ వాహనాల రాకపోకలు స్తంభిస్తున్నాయి. సిద్దవటం మండలంలోని భాకరాపేట మూడు రోడ్ల కూడలిలో తరచూ భారీ వాహనాలతో ట్రాఫిక్ సమస్య నెలకొందని ప్రయాణికులు అంటున్నారు. కడప – తిరుపతి వైపు హైవే రహదారిపై ప్రతి రోజు వందల వాహనాలు ప్రయాణం సాగిస్తుంటాయి. బద్వేల్ ప్రాంతం నుంచి వాహనాలు వస్తుండటంతో ఆదివారం భాకరాపేట కూడలిలో ఒక్కసారిగా వాహనాల రద్దీ నెలకొంది. దాదాపు 2 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి పోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. తరచూ హైవే రహదారిపై భారీ వాహనాలు వస్తుండటంతో వాహనాలు నిలిచిపోతున్నాయని ట్రాఫిక్ సమస్య లేకుండా నేషనల్ గ్రీన్ హైవే పనులను ప్రభుత్వం చేపట్టాలని ఇటు స్థానికులు, అటు ప్రయాణికులు నేషన్‌ల హైవే అధికారులను కోరుతున్నారు.

తహసీల్దారు ఆఫీస్ న్యాయశాఖకు అప్పగించాలి


హైకోర్టు న్యాయమూర్తికి వినతి పత్రాన్ని ఇస్తున్న రాజంపేట బార్ అసోసియేషన్ సభ్యులు

రాజంపేట : కోర్టు కాంప్లెక్స్ ఒప్పందంలో భాగంగా తహసీల్దారు ఆఫీస్‌ను న్యాయ శాఖకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు న్యాయమూర్తిని నిమ్మగడ్డ వెంకటేశ్వర్లును కోరినట్లు రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతునాయుడు తెలిపారు. ఆదివారం కడపలో స్టేట్ గెస్టు హౌస్‌లో హైకోర్టు న్యాయమూర్తిని వారు మర్యాద పూర్వకంగా కలిశారు. కోర్టు కాంప్లెక్స్ ఒప్పందంలో భాగంగా ఇప్పటి వరకు తహసీల్దారు కార్యాలయం అప్పగించకపోవడాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరితగతిన కార్యాలయం అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అలాగే రాజంపేటలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కోర్టు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశామన్నారు. హైకోర్టు నాయ్యమూర్తిని కలిసిన వారిలో జాఫర్ బాషా, రామచంద్ర నాయుడు, ప్రభాకర్, చంద్రమోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా మాతమ్మ విగ్రహ ప్రతిష్ట


హోమ పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ పంచాయతీ బత్రాజుగారిపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ మాతమ్మవిగ్రహాన్ని ప్రతిష్టించారు. రెండు రోజుల ప్రత్యేక పూజలు, హోమాల అనంతరం ఆదివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో యంత్ర ప్రతిష్ట చేసిన అనంతరం ఆలయ ధర్మకర్తలు నాగరత్నమ్మ, శ్రీనివాసులునాయక్‌ల ఆధ్వర్యంలో వేదపండితులు అమ్మవారి మూలవిరాట్ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట పూర్తి చేశారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలమాలలతో, నిమ్మకాయల దండలతో అలంకరించి పూజలు చేస్తూ హారతులిచ్చి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ కొత్తపల్లికి చెందిన ఓ మైనర్ బాలిక (17) మూడు రోజుల క్రితం అదృశ్యమైంది. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ హరిహర ప్రసాద్ కేసు నమోదు చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో బాలిక బెంగళూరులోని వారి మేనమామ ఇంట్లో తలదాచుకుంది. సదరు మేనమామ ఆదివారం బాలికను పోలీసులకు అప్పగించాడు.

మరో ఐదు నెలల్లో కన్నవాళ్ళు చేస్తున్న పెళ్ళి ప్రయత్నాలు తనకు ఇష్టం లేకపోవడంతో ఇంటి నుంచి బంధువుల ఇంటికి వెళ్లినట్లు బాలిక పోలీసుల ఎదుట వెల్లడించింది. అనంతరం పోలీసులు బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

కరువు ప్రాంతంగా ప్రకటించాలి

సంబేపల్లె : అన్నమయ్య జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఆయన సంబేపల్లె మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు లేకపోవడంతో రైతులు అరకొరగా సాగు చేసిన పంటలు ఎండిపోయాయన్నారు. పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు వెంటనే కూటమి ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ, పంటలు బీమా తదితర పథకాలను అందజేయాలన్నారు. గ్రామాలలో నెలకొన్న నీటి సమస్యలతో పాటు ఇతర సమస్యలపై ఆరా తీశారు. అనంతరం గుట్టపల్లె అంకిరెడ్డిగారిపల్లెలో ఆల్‌ఇండియా పంచాయతీరాజ్ జనరల్ సెక్రటరీ చిదంబరంరెడ్డి మనుమడు పరిన్ అన్వయ్ రెడ్డి కేశఖండన, నారాయణరెడ్డిపల్లె పంచాయతీలోని సుద్దలవాండ్లపల్లెలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు దివాకర్ మనుమరాలు జన్మదిన వేడుకలకు మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథ్‌రెడ్డి, రాయచోటి మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట


ఇసుక ట్రాక్టర్‌లు వెళ్లకుండా టక్కోలు నుంచి పెన్నా నదికి వెళ్లే దారిలో గ్రామస్తులు తీసిన గుంత

సిద్దవటం : మండలంలోని టక్కోలు, డేగనవాండ్లపల్లె గ్రామ సమీపంలోని పెన్నా నది నుంచి అక్రమ ఇసుక రవాణా జరగకుండా ఆదివారం స్థానికులు రహదారికి అడ్డంగా గోతులు తీశారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పెన్నానది నుంచి తరచూ అక్రమ ఇసుక రవాణా చేస్తున్న అక్రమార్కులు వేల రూపాయలు సంపాదిస్తున్నారని, గ్రామస్తులు ఇసుక అక్రమ రవాణా జరగకుండా వాహనాలు పెన్నానదిలోకి వెళ్లే రహదారిలో జేసీబీ యంత్రంతో గోతులు తీశారు. ఇక్కడి పెన్నానది నుంచి తరచూ ఇసుక తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోవడమే గాకుండా తమ భూములు వరదల సమయంలో కోతకు గురవుతున్నాయని రైతులు మండిపడ్డారు. సంబంధిత అధికారులు పట్టించుకోకుంటే ఇలానే ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే తమ పంట పొలాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

బదిలీల చట్టంలా ఫలితాల చట్టం తేవాలి


మూడే సూర్యుడు నాయక్

లక్కిరెడ్డిపల్లి : ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయులకు తెచ్చిన బదిలీల చట్టం మాదిరిగానే 10వ తరగతి ఫలితాల సాధన కోసం ప్రత్యేక చట్టం రూపొందించాలని పీఆర్‌టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు మూడే సూర్యుడు నాయక్ జిల్లా ప్రధాన కార్యదర్శి శీపాల ఉమామహేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలానే బ్రిడ్జ్ కోర్సుల శిక్షణ కోసం ప్రభుత్వం ప్రతి మండలంలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఒకటి లేదా రెండు కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాక విద్యా వలంటీర్లను నియమించి గౌరవ వేతనం అందించాలన్నారు. అలా చేసినప్పుడే ఫలితాలు 100% సాధించగలుగుతామని ఆయన తెలియజేశారు. అలా కాకుండా ఇప్పుడు కొనసాగిస్తున్న రెమెడియన్ తరగతుల బోధనా పద్ధతి ఉపాధ్యాయులను వేధించడం కాక మరొకటి కాదని ఎక్కడో పదో పాతికో ఫెయిల్ అయినవారిని దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయుల సమ్మర్ వెకేషన్‌ను నాన్ వెకేషన్గా మార్చి అందరికీ ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని కొనియాడారు. వెంటనే ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులతో కూడిన ప్రొసీడింగ్స్ ఇవ్వాలి లేదా ఎండ తీవ్రత దృష్ట్యా రెమెడియన్ తరగతులను వెంటనే రద్దు చేయడమో సమయాన్ని కుదించడమో చేయాలని ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిషనర్‌ను కోరారు.

కనుల పండువగా కల్యాణ వేడుక


కల్యాణ వేడుకను జరిపిస్తున్న వేదపండితులు


గ్రామోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్న యువకులు

పెనగలూరు : మండలంలోని దిగువ సిద్దవరంలో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. శనివారం రాత్రి గ్రామంలో సర్పంచ్ రాఘవరెడ్డి ప్రేమలత రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ వేడుకను ఘనంగా జరిపించారు. భక్తులు వందల సంఖ్యలో కల్యాణ క్రతువును తిలకించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి చెక్క భజన, తెల్లవారుజామున వసంతోత్సవాలు చల్లుకుంటూ సీతారాముల ఉత్సవమూర్తుల ఊరేగింపు విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ దేవుని కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎప్పుడు ముందుంటామని తెలియజేశారు. అలానే కల్యాణానికి వచ్చిన మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్, పండ్లు పంచిపెట్టారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసిన ఆగంతకులు

బి.కొత్తకోట : స్థానిక కస్తూర్బా బాలికా విద్యాలయం సమీపంలోని వ్యవసాయ బోరు వద్ద అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి ధ్వంసం చేశారు. వెంకటా చలపతి అనే రైతుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి అందులో ఉన్న కాపర్ వైరును అపహరించుకెళ్ళారు. ఈ నేపథ్యంలో ఆదివారం బాధిత రైతు డిస్కం అధికారులకు ఫిర్యాదు చేశాడు. గత నెల రోజుల వ్యవధిలో దుండగులు మూడు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసినట్లు రైతులు పేర్కొన్నారు. అంతేగాక రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేని కారణంగా కడుపు మండిన రైతులు పొలాల వద్దకు వెళ్ళేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇదే అదునుగా భావించిన దుండగులు డ్రిప్ పరికరాలను అపహరించుకెళుతున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.